ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



డీఎంహెచ్‌వో, సీసీ సస్పెన్షన్

● ఏసీబీకి పట్టుబడడంతో ప్రభుత్వం చర్యలు

శ్రీకాకుళం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి తెన్నేటి బాలమురళీకృష్ణ, ఆయన సీసీ వాన సురేష్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఓ మహిళా ఉద్యోగికి రీ పోస్టింగ్ ఆర్డర్ కాపీ ఇచ్చేందుకు ఈ నెల 3న శ్రీకాకుళంలో రూ20వేలు లంచం తీసుకుంటూ వీరిద్దరూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈనెల 17వరకు వారికి ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఈ పరిణామాలపై ప్రభుత్వానికి నివేదిక అందడంతో చర్యలకు ఉపక్రమించింది. వారిద్దరిని సస్పెండ్ చేసింది.



దీనబంధుపురం రహదారి పనులు ఇలా..

ఎప్పటికి దారికొచ్చేనో?

● నిధులున్నా చేపట్టని రహదారుల పనులు ● కొరవడిన అధికారుల పర్యవేక్షణ ● గిరిజనులకు తప్పని ఇబ్బందులు

మెళియాపుట్టి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):

గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం మంజూరు చేసిన రహదారుల పనులు ముందుకు కదలడం లేదు. నిధులు ఉన్నా పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత మార్చి నెలలో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో అన్ని రోడ్ల పనులను ప్రారంభించి వదిలేశారు. ఎక్కడికక్కడే తవ్వేసి విడిచిపెట్టడంతో గిరిజన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మెళియాపుట్టి మండలంలో 57 పనులకు సంబంధించి రూ.77.57 కోట్లు నిధులు మంజూరయ్యాయి. మందస మండలంలో 25 పనులకు రూ.10కోట్లు, కొత్తూరులో 21 పనులకు రూ.10.15 కోట్లు, హిరమండలం మండలంలో 15 పనులకు గాను రూ.16.12 కోట్లు మంజూరు చేశారు. వీటితో పాటు బూర్జ మండలానికి 4, సరుబుజ్జిలి 2, సారవకోట 5, టెక్కలి 2, నందిగాం 4, కంచిలి 5, పలాస మండలానికి 4 పనులు మంజూరు చేసినట్లు అధి కారులు చెబుతున్నారు. అయితే, నిధులు మంజూరు జరిగి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పను లు పూర్తికాలేదు. రికార్డుల్లో మా త్రం పూర్తయినట్లు అధికారులు చూపిస్తున్నారు. పక్క జిల్లా పార్వతీపురం మన్యంలో పూర్తిస్థాయిలో పనులు జరిగినా శ్రీకాకుళం జిల్లాలో చేపట్టకపోవడంపై గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఇంజనీరింగ్ అధికారుల సమన్వయం లోపంతోనే పనులు ముందుకు కదలడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ శాఖలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెల కొంది. అన్ని పనులకు ఈఈ స్థాయిలో అనుమతులు వచ్చే విధంగా అంచ నాలు తయారు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కొక్క పనికి రూ.40 లక్షలు దాటకుండా అంచనాలు తయారు చేశారు. రూ.40 లక్షలు అంచనాలు దాటితే ఈఎన్‌సీ అనుమతులు పొందాలనే ఉద్దేశంతో అలా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.



పనుల నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోలు అధికారులు (ఫైల్)

ఆ అధికారిపై చర్యలేవి?

పాతపట్నం నియోజకవర్గంలో అధికంగా పనులను ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న ఒక అధికారే చేయిస్తున్నారు. దీంతో పనుల్లో నాణ్యత కొరవడింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. పనులు నాణ్యతగా లేకపోవడంతో క్వాలిటీకంట్రోల్ అధికారులు ఇటీవల పరిశీలించారు. అయితే, ఇంతవరకు ఆ అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బయట నుంచి వచ్చిన వ్యక్తులకే అధికంగా పనులు ఇవ్వడంతో వారు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖను ప్రక్షాళన చేయడంతో పాటు రోడ్డు పనులు పూర్తి చేసేలా కలెక్టర్, పీవో చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి..



రెండు నెలల కిందట పోలూరు నుంచి రాజపురం వరకు సుమారు 4 కిలో మీటర్ల రోడ్డును తవ్వేసి వదిలేశారు. ఇంతవరకు పనులు పూర్తి చేయలేదు. గతంలో ఉన్న రహదారిని తవ్వేయడంతో రాళ్లు తేలి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేయాలి.

-భాస్కరరావు, మాజీ సర్పంచ్, దీనబంధుపురం

బిల్లులు కావడం లేదు..

రహదారుల పనులు పూర్తికాకపోవడం వాస్తవమే. చేసిన పనులకు బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. బిల్లులను ప్రభుత్వానికి పంపించాం. నిధులు వచ్చిన వెంటనే మళ్లీ పనులు ప్రారంభిస్తాం. **-రమాదేవి, ఈఈ, సీతంపేట**

చిట్టి చిట్టి అడుగులతో..

● సాగరంలోకి తాబేళ్ల పిల్లలు ● ఆలివ్ రిడ్లేలను విడిచిపెట్టిన కలెక్టర్



సముద్రంలోకి తాబేళ్ల పిల్లలను విడిచిపెడుతున్న, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎచ్చెర్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చిట్టి చిట్టి అడుగులతో ఆ చిన్ని జీవులు సాగరం ఒడిలోకి వెళుతుంటే.. వాటిని తన పొత్తిళ్లలోకి తీసుకునేందుకు సంద్రమమ్మ కెరటాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం చూపరులకు ముచ్చటగొల్పింది. బొంతల కోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం తీరంలో ఏర్పాటుచేసిన తాబేళ్ల సంరక్షణా కేంద్రంలోని ఆలివ్ రిడ్లే పిల్లలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం సముద్రంలోకి విడిచిపెట్టారు. చెన్నైకి చెందిన టి-ఫౌండేషన్ సంస్థ సహకారంతో స్థానిక మత్స్యకారులు ఘైలపల్లి సందయ్య, చీడిపల్లి లక్ష్మణరావులు ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో జనవరి నుంచి మే నెల వరకు తాబేళ్ల గుడ్లను పొదిగించి.. పిల్లలను ఎప్పటికప్పుడు సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వెంకటేష్, ఫారెస్ట్ రేంజర్ రాజశేఖర్, టి-ఫౌండేషన్ ప్రతినిధులు కె.సోమేశ్వరరావు, ఉపేంద్ర, సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ మాడుగుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం 280 తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టారు.

బారువ బీచ్‌లో కలెక్టర్ పర్యటన

సోంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బారువబీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సూచించారు. బారువ బీచ్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీచ్‌ఫెస్టివల్‌కు విస్తృతంగా ప్రచారం కల్పించి... ఘనంగా నిర్వహించేలా చూడాలని కోరారు. ఆయన వెంట జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పలాస ఆర్డీవో గ్రంధి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేడు చిత్రలేఖన పోటీలు

గుజరాతీపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై అన్ని మండలాల్లో గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్.తిరుమలచైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన వారికి శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. 19న తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టే కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

కొబ్బరి పరిశ్రమ వెలవెల



ఎగుమతి చేసేందుకు కొబ్బరి పుల్లల కట్టలను సిద్ధం చేసిన దృశ్యం

● పుల్లల వ్యాపారంపై ఇండోనేషియా ప్రభావం
● ధర ఉన్నా నాణ్యత లేమి
● మూతపడుతున్న బడ్డీలు
● వలసబాట పడుతున్న కార్మికులు
● ఉపాధి పథకం అనుసంధానం చేయాలని ప్రభుత్వానికి విన్నపం

కంచిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి)

కంచిలి మండల కేంద్రంగా ఒకప్పుడు కళకళలాడిన కొబ్బరి పుల్లల పరిశ్రమ ఇప్పుడు వెలవెలబోతుంది. ఒకవైపు ఆధునీకరణ, మరోవైపు ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న కొబ్బరి అనుబంధ పరిశ్రమల వస్తువుల ప్రభావంతో కంచిలిలో కొబ్బరి పుల్లల వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. కూలి ఖర్చులు అధికంగా ఉండడం, పుల్లల్లో నాణ్యత లోపించడం నష్టాలకు కారణమతోంది. ఫలితంగా కొబ్బరి పుల్లల బడ్డీలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఆధారపడిన కార్మికులు రోడ్డున పడ్డారు. ప్రభుత్వం ఇటువంటి పనులకు ఉపాధి హామీ పథకం అనుసంధానం చేస్తే తమకు ఎంతో మేలు కలుగుతుందని కార్మికులు అంటున్నారు.



కొబ్బరి పుల్లలను ఎండబెడుతున్న దృశ్యం

ఇదీ పరిస్థితి..

కొబ్బరి పరిశ్రమకు ఉద్దానం పెట్టింది పేరు. ముఖ్యంగా కంచిలి కొబ్బరి మార్కెట్ నుంచి ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు కొబ్బరి కాయలను ఎగుమతి చేసేవారు. దీనికి అను బంధంగా కొబ్బరి పీచు, పుల్లల వ్యాపారాన్ని నిర్వహించేవారు. దీంతో వందలాది బడ్డీలు రాత్రింబవళ్ల కార్మికులతో కళకళలాడేవి. సుమారు ఐదు దశాబ్దాల కిందట బయట రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపార కుటుంబాలు ఇక్కడ స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకుని కొబ్బరి మార్కెట్‌పై గుత్తాధిపత్యాన్ని సాధించారు. వీరి ఆధీనంలోనే ఉద్దానం కొబ్బరి వ్యాపారమంతా జరుగుతుండేది. కొబ్బరి కాయల విక్రయాలే కాకుండా కొబ్బరి అనుబంధ వస్తువుల ఎగుమతులను ప్రారంభించడంతో కార్మికులకు అదనపు ఉపాధి అవకాశాలు పెరిగాయి. ముఖ్యంగా యంత్రాలు అవసరం లేని, కొబ్బరి పుల్లల వ్యాపారం స్థానికంగా ఉన్న మహిళలు, వృద్ధులకు అదనపు ఆదాయాన్ని సమకూర్చింది. దీంతో వందలాది కుటుంబాలకు మేలు జరగడమే కాకుండా కొబ్బరి పుల్లల వ్యాపారం చేసే బడ్డీలు అధికమయ్యాయి. ఉద్దానంలో లభించే కొబ్బరి పుల్లలను 95 శాతం వరకు ఇళ్లల్లో శుభ్రపరిచే చీపుర్లగా ఉపయోగిస్తుంటారు. కొన్ని చోట్ల అంతిమ సంస్కారాలు నిర్వహించే సమయంలో పుష్పాలంకరణల్లో వినియోగిస్తుంటారు. దీంతో నిత్యం పదుల సంఖ్యలో లారీలతో కొబ్బరి పుల్లలను కంచిలి మార్కెట్ నుంచి ఇతర ప్రాంతాలకు పంపించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నెలకి ఒకటి, రెండు లారీల సరుకు పంపించడమే కష్టంగా మారిందని వ్యాపారులు చెబుతున్నారు.

ఇండోనేషియా ప్రభావం..

హుద్‌హుద్, తిత్లీ తుఫాన్‌ల తరువాత ఉద్దానం కొబ్బరి పంట తీరని నష్టాలకు గురైంది. తెగుళ్లు, చీడపీడల కారణంగా కొబ్బరి కాయల పరిమాణం తగ్గింది. కొబ్బరి చెట్ల కొమ్మలు పచ్చదనాన్ని కోల్పోయి, పుల్లల్లో సైతం నాణ్యత లోపించింది. ఈ ప్రభావం కొబ్బరి పుల్లల వ్యాపారంపై తీవ్రంగా పడింది. గోరుచుట్టుపై రోకలి పోటు చందంగా ఇండోనేషియా (మిగతా 8వ పేజీలో..)

ఆవులను తరలిస్తున్న వాహనాల సీజ్ 8 లో..
● అలికాం-బత్తిలి రహదారిపై పట్టుకున్న పోలీసులు

కందుకూరి పురస్కారాల ప్రదానం 7 లో..
● విజయవాడలో మంత్రి నుంచి అందుకున్న జిల్లా వాసులు

గొంతెండుతోంది..



ట్యాంకర్ వద్ద నీటిని పడుతున్న మహిళలు

● ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో దాహం కేకలు
● సరిగా పనిచేయని తాగునీటి వనరులు
● పట్టణ ప్రజలకు తప్పని ఇబ్బందులు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మునిసిపాల్టీలో తాగునీటి కష్టాలు నెలకొన్నాయి. గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. బిందెడు నీటిని పట్టుకునేందుకు ట్యాంకర్ల వద్ద యుద్ధాలు చేస్తున్నారు. ఎక్కడ చూసినా తాగునీటి ఇబ్బందులే కనిపిస్తున్నాయి. దశాబ్దాలుగా ఇవే వెతలు కొనసాగుతున్నా ప్రభుత్వాలు సరైన పరిష్కారమార్గం చూపడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. 21 వార్డులు ఉన్న మునిసిపాల్టీలో 15ఏళ్ల కిందట తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. అప్పట్లో 28 వేల మంది జనాభాకు తగ్గట్టుగా వీటిని వేశారు. కానీ, ఇప్పుడు పట్టణంతో పాటు జనాభా పెరిగింది. 2011 లెక్కల ప్రకారం 36వేల మంది జనాభా అని చెబుతున్నా.. ఆ సంఖ్య 50 వేలకుపైగా ఉంటుందని అంచనా. అందుకు తగ్గట్టు నీటి సరఫరా లేకుండా పోతోంది. పట్టణ జనాభాకు రోజుకు సగటున 5.10 మిలియన్ లీటర్ల నీరు అవసరం. ప్రస్తుతం అందులో సగం మాత్రమే సరఫరా చేస్తున్నారు. 1,2,3 వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. పలు ప్రాంతాల్లో భూ మట్టానికి మూడు నుంచి ఐదు అడుగుల గోతులో ఉన్న కుళాయి నుంచి నీటిని పట్టుకుంటున్నారు. ప్రస్తుతం పట్టణంలో 15 బోర్లు పనిచేయడం లేదని అధికారికవర్గాలు చెబుతున్నాయి. కానీ, అంతకు మించి బోర్లు మూలకు చేరాయని తెలుస్తోంది. ముఖ్యంగా రత్తకన్న పరిధిలో చాలా వీధులకు రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

దశాబ్దాలుగా ఇదే పరిస్థితి



పేరుకే మునిసిపాల్టీ. కానీ చిన్నపాటి గ్రామంకంటే తక్కువే. తాగునీటి సమస్య దశాబ్దాలుగా ఉంది. ఎప్పుడో 15 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన పైపులైన్లు, కుళాయిలు పాడయ్యాయి. ఎప్పుడు నీటి సరఫరా ఉంటుందో? ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిపెట్టాలి. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమార్గం చూపాలి.

-సాలిన ఢిల్లీయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏఎస్‌పేట, ఇచ్ఛాపురం

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



మునిసిపాల్టీలో తాగునీటి ఎద్దడి నిజమే. అయితే ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని అందిస్తున్నాం. ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. త్వరలో ఉద్దానం సమగ్ర మంచి నీటి పథకంతో పాటు కేంద్ర నిధులతో చేపడుతున్న పైలెట్ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. అంతవరకూ ఇబ్బందులు తప్పవు.

- ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం మునిసిపాల్టీ

పైలెట్ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో?

ఉద్దానం ప్రాజెక్టులో భాగంగా బాహుదా నదిలో ఊటబావులు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. క్లోరినేషన్ చేపట్టిన తరువాత రాజావారితోటలోని రిజర్వాయర్ ద్వారా పట్టణ అవసరాల కోసం 8 లక్షల లీటర్ల నీటిని ప్రతిరోజూ విడిచిపెడుతున్నారు. అయితే, ఈ నీరు ప్రజల అవసరాలకు ఏ మూలకు సరిపోవడం లేదు. రూ.54.48 కోట్ల కేంద్ర నిధులతో చేపడుతున్న పైలెట్ ప్రాజెక్టు ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. అది పూర్తయితే కానీ.. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికే అవకాశం లేదు. 1,2,3 వార్డుల పరిధిలోని పురుషోత్తపురం, ఏఎస్‌పేటకు ఏర్పాటుచేసిన పైపులైన్లు లీకులయ్యాయి. ట్రయల్ రన్ వేసి వదిలేశారు. ట్యాంకర్ల ద్వారా నీటిని అరకొరగా సరఫరా చేసి చేతులు దులుపుకొంటున్నారు. పురుషోత్తపురం పుష్పగిరి కొండపై 5 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న ట్యాంకును నిర్మించి వృథాగా వదిలేశారు. ఉద్దానం సమగ్ర మంచినీటి పథకంలో ఇచ్ఛాపురం మునిసిపాల్టీకి చోటిచ్చారు. కానీ..ఇంతవరకూ నీటిని అందించలేదు. దీంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. వైసీపీ ఐదేళ్ల కాలంలో పట్టించుకోలేదు. దీంతో కూటమి ప్రభుత్వంపైనే మున్సిపల్ ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● విజయనగరం ఎంపీ అప్పలనాయుడు



వినతిని స్వీకరిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు.బుధవారం చిలకపాలెంలో పబ్లిక్ గ్రీవెన్స్‌లో భాగంగా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తమ్మినాయుడుపేట నుంచి సింహద్వారం వరకు సర్వీసు రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకల వల్ల ప్రమాదం పొంచి ఉందని టీడీపీ నేత వావిపపల్లి రామకృష్ణ, జేజేఎం పనులు పూర్తిచేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని మాజీ సర్పంచ్ చిలక రాము, నారాయణపురం ఆధునీకరణ, గ్రోయన్స్ నిర్మాణం చేపట్టాలని పొన్నాడ టీడీపీ నేతలు పంచిరెడ్డి సత్యనారాయణ, పంచిరెడ్డి కృష్ణారావు ఎంపీకి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం నియోజకవర్గంలో కుటుంబ సాధికార సారధులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు బెండు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్, లంక శ్యామ్, కుమరాపు రవికుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గొర్లె లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు: ఎమ్మెల్యే రవికుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి బీటీరోడ్డు సౌకర్యం కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తమ్మినేని శారద అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. తొలుత పలు శాఖలపై సమీక్షించారు.గ్రామాల్లో చేపడుతున్న శాఖల విధి నిర్వహణపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి పథకం నిధులతో చేపడుతున్న సీసీరోడ్లు, డ్రైనేజీల పనులపై సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చూపుతున్నారని, పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. అలాగే అలాగేఆమదాలవలసలోని టీడీపీకార్యాలయంలో ఎమ్మెల్యే రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు.ఈసందర్భంగానాలుగు మండలాలు,మునిసిపాలిటీకి చెందిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు.ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ గోవిందరావు, సర్పంచ్ నూకరాజు, ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, సీఐ పి.సత్యనారాయణ, నాయకులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, సత్యనారాయణ, మొదలవలన రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర: ఎమ్మెల్యే శంకర్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలోని సీపన్నాయుడుపేట, ఫాజుల్‌బాగ్‌పేట ప్రాంతాల్లో పల్లెనిద్ర కార్యక్రమంలో పర్యటించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరావ పాల్గొన్నారు.

● సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు.బుధవారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో గల జిల్లా టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా గార, శ్రీకాకుళం మండలాల నుంచి తమ సమస్యలను విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యత అని తెలిపారు.

24, 25 తేదీల్లో ఉపాధ్యాయులకు శిక్షణ

ఆమదాలవలస, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ బడులను రక్షిద్దాం పేరిట కార్యక్రమంలో భాగంగా ఈనెల 24, 25 తేదీల్లో శ్రీకాకుళంలో ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర తెలిపారు. ఈమేరకు బుధవారం ఆమదాలవలసలోని గేటులోని మున్సిపల్ హైస్కూల్‌లో శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్య క్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి భాస్కరరావు, కింతలి చంద్రరావు, చింతాడ వెంకట సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

27న శ్రీకాకుళంలో మెగా జాబ్‌మేళా

అరసవల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 27న ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండుశంకర్ తెలిపారు.బుధవారం స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయి కుమార్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖతో కలిసి జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసీ విద్యార్హత కలిగి, 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతకు 20 కంపెనీలు 972 ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను స్కిల్‌యూనివర్స్‌ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హతల ఒరిజినల్స్, జెరాక్స్ కాపీలు, ఒక పాస్‌పోర్టు ఫోటోతో సహా కార్యక్రమానికి హాజరుకావాలని తెలిపారు.

19లోగా పారా మెడికల్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం

శ్రీకాకుళం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్ బైపీసీ 2024-25లో పూర్తిచేసిన విద్యార్థులకు బీఎస్సీ పారా మెడికల్, నర్సింగ్, బీపీటీ, ఎంఎల్‌టీ కోర్సుల్లో ఈనెల 19 వరకు చేరవచ్చని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం కల్పించి, ఫీజును జీతం నుంచి మినహాయిస్తామని పేర్కొన్నారు.ఈ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు పదోతరగతి, ఇంటర్, టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 19వ తేదీ సాయంత్రం మూడుగంటల్లోగా రాగోలులోని జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలోని కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు 91219 99654, 7680945357, 7995013422 నంబర్లకు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

ఏపీజీఎల్ఐ ఫైళ్లను ఆన్‌లైన్‌లో పంపాలి

అరసవిల్లి, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఉద్యోగుల గ్రూప్ ఇన్సూరెన్స్ (ఏపీజీఎల్ఐ)కి సంబంధించిన పాత ఫైళ్లను ఇకపై ఆఫ్‌లైన్‌లో కాకుండా, తప్పనిసరిగా నిధి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే పంపించాలని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జీవిత బీమా ఫైళ్ల వివరాలు, పాతబీమా ప్రీమియం, వలంటరీ ప్రీమియం పెంపు వంటి వివరాలను ఉద్యోగులు తమ యూజర్ లాగిన్ ద్వారా నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి సంబంధిత డీడీవోకు పంపించాలని పేర్కొన్నారు. గత ఏడాది ఫిబ్రవరి 16న ప్రభుత్వం జారీ చేసిన జీవో-19 ప్రకారం ఈ మార్గదర్శకాలు అమల్లోకి వచ్చాయని తెలిపారు.

వీరేశలింగం పంతులుకు ఘన నివాళి

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలో సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వీరేశలింగం చిత్రపటానికి రంగస్థల కళాకారుల సమాఖ్య గౌరవాధ్యక్షుడు నరసింహశాస్త్రి, రామలింగస్వామి,రామచంద్రదేవ్, వెంకటరావు, రమణారావు, అప్పారావులు వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు.

ద్రవ జీవామృతంతో రైతులకు మేలు

కంచిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ద్రవ జీవామృతంతో రైతులకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ తెలిపారు. బుధవారంమండలంలోని అంపురం పంచాయతీ పరిధిలోగల బలియాపుట్టుగలో రైతులకు ద్రవజీవామృతం తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదివేల లీటర్ల ద్రవజీవామృతం తయారు చేసి, దీని వాడకం వల్ల రైతుకు కలిగే ప్రయోజనాలు వివరించారు.

పశువుల పెంపకంపై మహిళా పాడి రైతులకు అవగాహన

కంచిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సోంపేటలో పశువుల పెంపకంలో మహిళా పాడి రైతులు ఎదుర్కొనే సమస్యలు, వాటి పరిష్కారంపై భువనేశ్వర్‌లోని ఇంటర్నేషనల్ లైవ్‌స్టాక్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఐఎల్ఆర్ఐ) శాస్త్రవేత్తలు అరుణ్‌కుమార్ పండా, బ్రిగేంద్ర ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.రాజగోపాల్, సోంపేట సహాయ సంచాలకులు కె.అప్పలస్వామి, కంచిలి, సోంపేట, కవిటి పశువైద్యాధికారులు టి.శిరీష, కిరణ్‌కుమార్, సంజయ్‌కుమార్, ఏపీఎం అప్పలనరసమ్మ పాల్గొన్నారు.

పలాసపురంలో చిరుధాన్యాల ప్రదర్శన

సోంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగుతో నేలతల్లి బాగు అన్న నినాదం ప్రకృతివ్యవసాయంపై ప్రచారం చేస్తున్నట్లు పకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యానారాయణ తెలిపారు.పలాసపురంలో చిరుధాన్యాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రీజినల్‌ట్రైనింగ్ ఆఫీసర్ హేమసుందర్, గోవిందరెడ్డి, కుమారి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

కంచిలి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వపాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ కోరారు.ఈ మేరకు బుధవారం కత్తివరం ప్రాథమికోన్నతపాఠశాల హెచ్ఎం మాధవి బెహరా, విద్యాశాఖ సిబ్బందితో కలిసి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలను, విధానాలు, సౌకర్యాలు గురించి వివరించారు. అనంతరం ఎంఈవో శివరాంప్రసాద్, సిబ్బందితో కలిసి కొత్త అంపురంలో ఉపాధి వేతనదారుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను వివరించి, తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.కార్యక్రమంలో సీఎంఆర్‌టీ డిల్లీరావు, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్థుల సహకారంతోనే విద్యాభివృద్ధి

కవిటి, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): గ్రామస్థుల సహకారంతోనే విద్యాభివృద్ధి సాధ్యమని ఎంఈవో ధనుంజయమజ్జి తెలిపారు.బుధవారం బొన్నపుట్టుగ ప్రాథమిక పాఠశాల రజతోత్సవాలు నిర్వహించారు.కార్యక్రమంలో హెచ్ఎం ఇ.బార్లవ్,వైస్ ఎంపీపీ పి.నేతాజీ,గ్రామస్థులు పి.బాలయ్య, బి.సీతారాంమూర్తి, నారాయణమూర్తి, పి.ప్రవీణ్, శ్యాం పాల్గొన్నారు.

సీవీఆర్ మూర్తి నేత్రాలు సజీవం



సీవీఆర్‌మూర్తి (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్/ అరసవల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని సీవీ నాగజ్యోతి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట నరసింహమూర్తి (82) మంగళవారం మృతిచెందారు. స్థానిక డచ్‌బిల్డింగ్ వద్ద సీవీ నాగజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ పేరుతో లక్షలాది మందికి అన్నదానం చేసిన ఆయన ట్రస్ట్‌కు యావదాస్తిని వెచ్చించిన విషయం విదితమే.ఈ మేరకు రెడ్‌క్రాస్ టెక్నీషియన్స్ సీవీఆర్ మూర్తి రెండు కళ్ల నుంచి కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి తరలించారు. ఆయన మృతి పట్ల రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సభ్యులు మల్లా చక్రవర్తి, దుర్గా శ్రీనివాసరావు, నిక్కు అప్పన్న, తదితరులు సంతాపం ప్రకటించారు.

గౌరవవేతనం చెల్లించాలని ఎంపీటీసీల నిరసన

జి.సిగడాం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం గౌరవవేతనం చెల్లించాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం జి.సిగడాం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీటీసీలు నిరసన తెలిపారు.తొలుత ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరిగినమండల సమావేశానికి 16 మంది సభ్యులకుగాను సీతంపేట ఎంపీటీసీ మాత్రమే హాజరయ్యారు. మరో ఐదుగురు సమావేశం ప్రారంభానికి ముందే రికార్డులో సంతకాలు పెట్టి వెనుదిరిగారు. మిగతా 10 మంది సభ్యులు సమావేశానికి హాజరుకాకుండా ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సమావేశానికి సరిపడా ఎంపీటీసీ సభ్యులు హాజరు కావడంతో రికార్డుల్లో సంతకాలు తీసుకొని సభను నిర్వహించారు.అయితే సమస్యలపై చర్చలు నిర్వహించేందుకు సభ్యులు సమావేశ మందిరంలో లేకపోవడంతో అధికారులు వాయిదావేశారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ 26 నెలల నుంచి గౌరవవేతనం చెల్లించలేదని తెలిపారు. కాగా గ్రామాల్లో సమస్యలపై చర్చించడం మానేసి గౌరవవేతనం చెల్లించలేదని నిరసర చేపట్టడం ఎంతవరకు సమంజసమని పలువురు వైసీపీ నాయకులు ఎంపీటీసీలను ప్రశ్నించారు.

ఈడీ అధికారుల తీరుపై కాంగ్రెస్ నాయకులు..

అరసవల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను ఓర్వలేక గొంతు నొక్కే చర్యలకు పాల్పడడం దురదృష్టకరమని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు చార్జిషీటు దాఖలుచేయడంతోపాటు ఆ అభియోగపత్రాల్లో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీని ఏ1గా, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఏ2గా పేర్కొనడంతో బుధవారం శ్రీకాకుళంలోని ఆదాయపన్ను శాఖ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కేవీఎల్ఎస్.ఈశ్వరి, సైదుల్లా ఖాన్,వెంకటనాయుడు, బి.సంజీవరావు, దాలినాయుడు చంద్రరావు పాల్గొన్నారు.

అదనపు డిపో ఏర్పాటు ప్రతిపాదన వద్దు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో అదనంగా ఐఎంఎల్ డిపో ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకొని, ఎచ్చెర్ల డిపోపై ఆధారపడుతున్న హమాలీల ఉపాధిని కాపాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, హమాలీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.బంగార్రాజు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావుకు వారితో కలిసి ఎన్.రమణ, ఎస్.నరేంద్రకుమార్, ఎన్.వెంకటేష్ వినతిపత్రం అందజేశారు.

రెల్లిగెడ్డ మరమ్మతులకు నిధుల మంజూరు

ఆమదాలవలస, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):పొందూరు మండలంలోని రెల్లిగడ్డ తాత్కాలిక మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని టీడీపీ కార్యాలయం వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. తాడివలస-పైడిజోగిపేట మధ్య ఉన్న రెల్లిగడ్డను తాత్కాలిక మరమ్మతులు చేయడానికి రూ.14.40 లక్షలు మంజూరు చేసినట్టు కలెక్టర్ ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చినట్టు తెలిపాయి.

ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్‌గా మణిచంద్రప్రకాష్‌రెడ్డి



మణిచంద్ర ప్రకాష్

కవిటి, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్‌గా బి.మణిచంద్ర ప్రకాష్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వంఉత్తర్వులు జారీ చేసింది. కవిటి మండలంలోని జాడుపూడి ఆర్ఎస్ గ్రామానికి చెందిన మణిచంద్రప్రకాష్ టీడీపీ ఆవిర్భావంనుంచి కార్యకర్తగా ఉన్నారు. 2005 నుంచి ఇప్పటివరకు కవిటి మండల టీడీపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.ఈ మేరకు కేంద్ర,రాష్ట్రమంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, కె.అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ అశోక్‌కు మణిచంద్రప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా టీడీపీ నాయకులు బి.రమేష్, పి.కృష్ణారావు, ఎస్‌వీరమణ, ఎ.మధు, బాసుదేవ్‌రౌళో ,సంతోష్‌పట్నాయక్, భీమారావురౌళో, బి.తిరుమలరావు, శ్రీనివాసరౌళో, బి.చిన్నబాబు, హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని పుణ్యపువీధిలో ఉన్న సీతారామచంద్రమూర్తి సహిత అభయాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజల్లో సుంకరి కృష్ణకుమార్, ఎం.రామనా రాయణరావు పాల్గొన్నారు. అలాగే శ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా వద్దగల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం 15వ వార్షికోత్సవం పురస్కరించుకుని భక్తి శ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తప్పదు

అరసవల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం తప్పదని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలోని నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మునిసిపల్ ప్రజారోగ్య అధికారి పి.సుధీర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసారు.

నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు: ఎస్పీ

శ్రీకాకుళం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి:నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు.బుధవారంవిజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా శ్రీకాకుళం నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు వాహన చోదకులకు ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.అలాగే ఒడిశా సరిహద్దులోని గొప్పిలి వద్ద చెక్‌పోస్టులో తనిఖీలు చేశారు.

హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి

లావేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని, హెల్త్‌కార్డులు మంజూరుచేయాలని,అర్హులైన క్షేత్ర సహాయకులకు టీఏ, కంప్యూటర్ ఆపరేటర్, ఏపీవో వంటి ఉద్యోగున్నతులు కల్పించాలని ఉపాధి క్షేత్ర సహాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం లావేరు ఎంపీడీవో వెంకటరాజుకు ఉపాధి క్షేత్ర సహాయకులు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

తహసీల్దార్‌గా చక్రవర్తి

గార, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గార తహసీల్దార్‌గా ఎం.చక్రవర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రమణారావు గతఏడాది డిసెంబరులో పదవీ విరమణ చేశారు.ప్రస్తుతం కలెక్టర్‌లో పనిచేస్తున్న చక్రవర్తిని తహసీల్దార్‌గా నియమించారు.

ఉద్యోగాలకు 17 మంది ఎంపిక

ఎచ్చెర్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలో నాలుగో సంవత్సరం పూర్తిచేసిన 17 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జేబీఎం ఆటో లిమిటెడ్ (చెన్నై)లో 16 మంది, అన్నా ఐటీ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఒకరు ఉద్యోగాలు సాధించారు. వీరికి నియామక పత్రాలను వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అందజేశారు. కాగా వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ బ్రాంచ్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న, మధులత పాల్గొన్నారు.

వైఫల్యాలను ఎండగట్టాలి

ఎచ్చెర్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ కార్యక్రమాలను నిర్వహించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ కోరారు. బుధవారం మండలంలోని తమ్మినాయుడుపేటలో నియోజకవర్గంలో నియమించిన మండల కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, పార్టీ మండలాధ్యక్షుడు బోర సాయిరాం, మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దనరెడ్డి పాల్గొన్నారు.



మంత్రి కందుల దుర్గేష్ నుంచి కందుకూరి పురస్కారాలను అందుకుంటున్న మెట్ట పోలినాయుడు, కుమార్‌నాయక్, గుత్తు చిన్నారావు, బెందాళం శోభన్‌బాబు, బల్లెడ చలపతిరావు

కందుకూరి పురస్కారాలు ప్రదానం

శ్రీకాకుళం కల్చరల్/పలాసరూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కళాకారులు గుత్తు చిన్నారావు, మెట్ట పోలినాయుడు, డాక్టర్ కుమార్‌నాయక్, బెందాళం శోభన్‌బాబు, బల్లెడ చలపతిరావులకు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రంలో తెలుగు నాటకరంగ దినోత్సవం పురస్కరించుకొని కందుకూరి పురస్కారాలు ప్రదానంచేశారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి పదివేల రూపాయలు నగదు బహుమతిని అందజేసి, సత్కరించారు. పురస్కారాలు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా అందుకున్నారు.

రెజ్లింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ఎచ్చెర్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ బ్రాంచ్‌లో తృతీయ సంవత్సరం చదువుతున్న ఎండ శివచరణ్ రాజస్థాన్‌లోని కోటాలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు జరిగేజాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-20 కేటగిరిలో 72కిలోలవిభాగంలో రజిత పత కాన్ని సాధించాడు.

●రణస్థలం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):రణస్థలం ఏపీ మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న దున్నసుచరితఇటీవల చత్తీస్‌ఘడ్‌లోని బీఆర్‌యాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ పెన్‌కాట్‌సిలాట్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపింది.ఈమేరకు బ్రాంజ్ మెడల్ సాధించింది.సుచరితను జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ప్రిన్సిపాల్ పి.శ్రీధర్, ఉపా ధ్యాయులు అభినందించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

రణస్థలం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల నివారణపై మహిళలు అవగాహన ఉండాలని రణ స్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్ తెలిపారు. బుధవారం రణస్థలంలోని లక్ష్మీనగర్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బహుళ అంతస్థుల్లో ఉంటున్న మహిళలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

జి.సిగడాం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో డోల పాపినాయుడు తెలిపారు. బుధవారం మదుపాంలో పౌష్టికాహారం పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయష్కరమన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

శ్రీకాకుళం,ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్థక శాఖలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులకు ఇనప రాజారావు, చీర రాజేశ్వరి ఇటీవల ఫిర్యాదుచేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్, ఎస్సీ పీఎస్‌సీ నిధులపై విచారణ చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. ఇదే ఫిర్యాదుపై విచారణ నిర్వహించి వాస్తవాలు నివేదికగా ఇవ్వాలని త్రిసభ్య కమిటీగా ఆర్డీవో, డీపీఓ, జేడీను కలెక్టర్ నియమించినా, విచారణ పూర్తి కాలేదు. దీంతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్, పశుసంవర్థకశాఖ కార్యదర్శి బుడితి రాజశేఖర్‌కు వారి వద్ద ఉన్న ఆధారాలతో ఫిర్యాదుచేశారు.ఈ నేపథ్యంలో తక్షణమే విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని ఉత్తర్వులు వెలువడడంతో విచారణ అధికారిగా కొవ్వాడ అణువిద్యుత్ కేంద్ర ప్రత్యేక ఉపకలెక్టర్ నియమించారు. దీంతో పశుసంవర్థకశాఖలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రిటైరైన,ప్రస్తుతమున్న అధికారులు వెంకటేశ్వర్లు, యోగేశ్వరరావు, రాజగోపాలరావు, కరుణాకరరావు, కిషోర్, బాలకృష్ణ ఈనెల 15న విచారణకు హాజరుకావాలని ఇప్పటికే నోటీసులు జారీఅయ్యాయి. గడువు ముగిసినా విచారణ ప్రారంభం కాలేదని విశ్వసనీయ సమాచారం. చిత్తశుద్ధితో విచారణ నిర్వహించి గోల్‌మాల్ అయిన నిధుల లెక్కతేల్చాలని ఫిర్యాదుదారులు ఆ ప్రకటన ద్వారా కోరారు.

ఆవులను తరలిస్తున్న వాహనాలు సీజ్


పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

సరుబుజ్జిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి సమీపంలో బుధవారం అక్రమంగా ఆవులను తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. కొత్తూరు మండలంలోని బలద సంత నుంచి విజయనగరం జిల్లా అలమండకు అక్రమంగా ఆవులు తరలిస్తున్నట్లు భజరంగదళ్ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు అలికాం-బత్తిలి రహదారిపై తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు ఆవులు తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. కాగా రెండు వాహనాల్లో ఉన్న తొమ్మిది ఆవులను విజయనగరం జిల్లా గుర్ల మండలంలోని గుజ్జంగవలసలో ఉన్న గోశాలకు తరలించినట్లు చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం

కోటబొమ్మాళి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నారాయణవలస సమీపం నుంచి లారీలో 13 ఆవులను అక్రమంగా తరలిస్తున్న సమాచారంతో బుధవారం ఎస్ఐ వి.సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వీటిని విజయనగరం జిల్లా కొత్తవలస గోశాలకు తరలించారు. ఆవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రణస్థలం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరాపుపేట గ్రామానికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. కొత్తకోట్ల సత్యం మంగళవారం కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగింది. దీంతో శ్రీకాకుళంలోని సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. ఈమేరకు బుధవారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త కొత్తకోట్ల ఎల్లయ్య ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసునమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఎన్టీఆర్ కాలనీ ఏడో లైన్‌లో నివాసం ఉంటున్న ముడిదాన కేశవరావు(38) బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నందిగాం మండలం హుకుంపేటకు చెందిన కేశవరావు టెక్కలిలో నివసిస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. భార్య కొన్నేళ్ల కిందట మృతిచెందగా, ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని టెక్కలి పోలీసులు పరిశీలించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

కాలువలపై నిర్మాణాల తొలగింపు

సంతబొమ్మాళి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఇజ్జువరం పంచాయతీలో కాలువలపై పలువురు నిర్మాణాలు చేపట్టడంపై వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పంచాయతీ అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలపై డీపీవోకి పలువురు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఉమాపతి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ల సాయంతో వాటిని తొలగించారు.

ఈనెలలోనే విద్యార్థులకు ప్రవేశాలు: డీఈవో



పోలాకి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రానున్న విద్యాసంవత్సరానికి గాను ఈనెల 21, 22, 23 తేదీల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నామని, దీనికోసం స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు డీఈవో ఎస్.తిరుమలచైతన్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జూన్ 12న పాఠశాలల ప్రారంభం నాటికి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నియామకాలు చేపడతామన్నారు. గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన ప్రాథమిక స్థాయి విద్యార్థులను ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి వెనక్కి పంపి స్తామన్నారు. 45 మంది విద్యార్థులున్న గ్రామాల్లో పాఠశాలను ఆదర్శ పాఠశాలగా మార్పు చేస్తామన్నారు. తరగతికి ఒక టీచర్ ఉండేలా తీర్చిదిద్దుతామన్నారు. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలతో పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుగా విభజన చేస్తామన్నారు. విద్యార్థుల ప్రవేశాలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామన్నారు. ఎంఈవోలు, హెచ్ఎంలకు శిక్షణ ఇస్తామని చెప్పారు.

గ్రానైట్ క్వారీపై ప్రజాభిప్రాయ సేకరణ

నందిగాం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గొల్లూరు పంచాయతీ సొంటినూరు పరిధిలోని కొండపై గ్రానైట్ క్వారీ నిర్వహణకు గాను అనుమతుల కోసం బుధ వారం ఆర్డీవో జి.వెంకటేష్, కాలుష్య నివారణ మండలి ఈఈ కరుణశ్రీ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టెక్కలి మైన్స్ ఏడీ విజయలక్ష్మి, తహ సీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావు, సర్పంచ్ జీరు రాజేశ్వరీ నానీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలో పేట క్రీడాకారుల ప్రతిభ

నరసన్నపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ఫుట్‌బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన టోర్నమెంట్‌లో నరసన్నపేట క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. డే అండ్ నైట్ మ్యాచ్‌లో పది జట్లు పాల్గొనగా ఫైనల్‌లో నరసన్నపేట జట్టు శ్రీకాకుళం జట్టుపై రెండు గోల్స్ చేసి ట్రోఫీని సాధించింది. ఈమేరకు జట్టు సభ్యులను అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్, కోచ్ అనిల్ అభినందించారు.

జగన్నాథ స్వామి ఆలయ నిధుల స్వాహాపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హరిపురం ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): సాభకోట గ్రామంలోని జగన్నాథ స్వామి ఆలయం నిధుల స్వాహాపై బుధవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ విచారణ చేపట్టారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' లో 'జగన్నాథా చూసితివా' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులు, ఆలయ అర్చకుల నుంచి సమాచారం సేకరించారు. నివేదికను ఉన్నతాధి కారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈవో వాసుదేవరావు, అర్చకుడు హరికృష్ణ పండా పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి


పాలభిషేకం చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పరిశ్రమల సంఘ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు బుధవారం నిమ్మాడలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు. మినరల్ లీజు 20 నుంచి 30 ఏళ్లకు పెంచడం, కరోనా సమయంలో పెంచిన సీనరేజ్‌ల తగ్గించి సహకరించడం పరిశ్రమలకు శుభ పరిణామమన్నారు. కార్యక్రమం లో నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్, గ్రానైట్ యజమానులు చౌదరి, గోపి, గ్రానైట్ పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

సమష్టిగా సమస్యల పరిష్కారం

● మండల సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


పోలాకి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సమస్యలను పార్టీలకు అతీతంగా సమష్టిగా పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యా లయ సమావేశ మందిరంలో ఎంపీపీ ముద్దాడ దమయంతి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల తరువాత రాజకీయం మరిచిపోవాలని, పార్టీ విభేదాలుండకూడదన్నారు. పలువురు సభ్యులు తెలిపిన సమస్యలను విన్న ఆయన తీవ్రంగా స్పందించారు. అన్నిరకాల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సహకారం అవస రమన్నారు. మండలంలో ఉపాధి హామీ పనుల తీరుపై ఏపీవోని పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. సమా వేశంలో జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, డీఈవో తిరుమలచైతన్య, తహ సీల్దార్ మంగి సురేష్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు వద్దకునేవారు ఊయలలో వేయండి

నరసన్నపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పిల్లలు వద్దనుకునేవారు సామాజిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఊయలలో వేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక ఆసుపత్రిలో ఊయల కార్యక్రమం ప్రారంభించారు. బాలింతలకు పండ్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, ఆసుపత్రి అభివృద్ధికమిటీ సభ్యుడు శిమ్మ జగన్నాథం, ఐసీడీఎస్ పీవో నాగమణి, ఏపీవో లావణ్య, ఆసుపత్రి సూపరెండెంట్ శ్రీనివాసబాబా, పలువురు టీడీపీ నేతలు, వైద్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రమణమూర్తి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు.

నిర్వాసితులను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): నిర్వాసితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం చీపురుపల్లి, దాసుపురం, అర్చనాపురం గ్రామాల్లో పర్యటించి నిర్వాసితులతో మాట్లాడారు. తమకు పూర్తిస్థాయి ప్యాకేజీ అందలేదని, కనీసం నిర్వాసిత గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించలేదని నిర్వాసితులు అన్నారు. దాసుపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రోడ్లు, కాలువలు, పాఠశాల నిర్మాణం జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమ స్యలను మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో నరసింహప్రసాద్ పండా తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీ పట్టుకొమ్మలు

పాతపట్నం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే పార్టీ పట్టుకొమ్మలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం 'కార్యకర్తే అధినేత' కార్యక్రమం నిర్వహించారు, కష్టకాలంలో నిలిచిన కార్యకర్తలే పార్టీకి బలమన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఇటీవల పార్టీసభ్యత్వ నమోదులో ఉత్తమ ఫలితాలు సాధిం చిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి


కమిషనర్ రామారావుకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

పలాస/పలాస రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని, బాధ్యులపై చర్యలు తీసుకుని స్థలాలను పరిరక్షించాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ ఎన్.రామారావు, తహసీల్దార్ ఎన్.కల్యాణ చక్రవర్తిలకు వినతిపత్రాలు అందించారు. 31 వార్డుల్లోనూ ఆక్రమణలు జరిగాయని వారి దృష్టికి తీసుకువెళ్లారు. చిన్నబడాం, నర్సిపురం గ్రామాల సరిహద్దు ల్లోనూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించారని, సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు తదితరులు కోరారు. చిన్నబడాం గ్రామానికి వెళ్లే పాత జాతీయ రహదారి మార్గంలో డైట్ కళాశాల వద్ద ప్రభుత్వ రోడ్డును ఆక్రమించారని, పెసర పాడు మార్గంలో ప్రభు త్వ భూమిని ఆక్రమించి భవనాలు నిర్మించారని, నర్సిపురం కాలనీ వద్ద బెనియా బందను ఆక్రమించి లేఅవుట్ వేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సూదికొండ ఏరియా పురుషోత్తపురం 346 సర్వే నెంబరులో సుమారు 80 సెంట్లు భూమిని ఆక్రమణకు గురైందన్నారు ప్రధాన చెరువులు, కాలువలు, శ్మశాన స్థలాలు ఆక్రమించారని, దర్యాప్తు చేపట్టాలని కోరారు. కార్యక్రమాల్లో టీడీపీ నేతలు టంకాల రవిశంకర్‌గుప్తా, డొక్కరి శంకర్, దడియాల నర్సింహులు, దువ్వాడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి పరిశ్రమ వెలవెల

(ఐదో పేజీ తరువాయి)

నుంచి దిగుమతి అవుతున్న కొబ్బరి కాయలు, పుల్లల కారణంగా ఇక్కడి మార్కెట్ నాశనమైంది. ఇండోనేషియా కొబ్బరి పుల్లలు నాణ్యతతో పాటు ధర తక్కువగా ఉండడంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో కంచిలి మార్కెట్ పూర్తిగా మసకబారింది.

ధర ఉన్నా.. నాణ్యత లేమి..

ఉద్దానం కొబ్బరి పుల్లలకు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పటికీ నాణ్యత లోపించడంతో వాటికి తగిన ఆదరణ లభించడం లేదు. గతంలో నాణ్యమైన పచ్చి కొబ్బరి పుల్లలను కిలో రూ.10 నుంచి రూ.15కు కొనుగోలు చేయగా, ప్రస్తుతం రూ.52 నుంచి రూ.55కు రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఎండిన కొబ్బరి పుల్లలైతే కిలో రూ.33 నుంచి రూ.35కు కొనుగోలు చేస్తున్నారు. అయితే, ప్రస్తుతం ధర ఉన్నా నాణ్యత లేకపోవడంతో పుల్లలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో కొబ్బరి పుల్లల బడ్డీలు మూతపడుతున్నా యి. గతంలో సుమారుగా 30 నుంచి 40 బడ్డీలు ఉన్న కంచిలిలో ప్రస్తుతం 4 నుంచి ఐదు మాత్రమే ఉన్నాయి. కేవలం పుల్లల బడ్డీలు మూతపడటమే కాకుండా ఇళ్ల వద్ద కొబ్బరి పుల్లలు సేకరించే మహిళలు, వృద్ధులు సైతం అమ్మకాలు సాగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మధ్య, చిన్న కుటుంబాలు జీవనోపాధి కోసం బయట ప్రాంతాలకు వలస పోతున్నాయి.

మరింత చేయూత అవసరం..

ఉద్దానంలో నాశనమైన కొబ్బరి పంట అభివృద్ధికి ప్రభుత్వం చేయూత అందిస్తున్నప్పటికీ అది ఇంకా పూర్తిస్థాయిలో అందడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కొబ్బరి తోటల్లో కందకాల తవ్వకాలకు సంబంధించిన పనులను ప్రభుత్వం ఉపాధి పథకానికి అనుసంధానం చేయడంతో పెద్ద రైతులు మాత్రమే ప్రయోజనం పొందుతున్నారు. తోటల్లో కొబ్బరి కొమ్మలు కోయడం, కొమ్మల నుంచి పుల్లలు సేకరించడం, వాటిని ఎగుమతులకు సిద్ధం చేయడం వంటి పనులు చాలా కష్టంతో కూడుకున్నవి. రోజంతా పని చేసే కూలీలకు వేతనం సరిపగా లేకపోవడంతో ఈ పనులకు కూలీలు దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం ఇటువంటి పనులకు సైతం ఉపాధి పథకం అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో మేలు జరగడమే కాకుండా కొబ్బరి కార్మికులకు ఆదాయం పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కూలి గిట్టుబాటు కావడం లేదు..



రోజంతా కొబ్బరి బడ్డీల్లో పని చేస్తే కూలి గిట్టుబాటు కావడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 15 నుంచి 20 కిలోల పుల్లలను మాత్రమే సిద్ధం చేయగలుగుతున్నాం. ఏ పనులు లేక, తప్పనిసరి పరిస్థితుల్లో ఈ పని చేయాల్సి వస్తుంది. ఇళ్ల వద్ద చేస్తామంటే పనులు లేవు.

-లచ్చమ్మ, కూలీ, పద్మతుల

ఇండోనేషియా ప్రభావం ఎక్కువగా ఉంది..



గతంలో కంచిలి మార్కెట్ నుంచి ఎగుమతి చేసే కొబ్బరి కాయలు, పుల్లలకు ఎంతో డిమాండ్ ఉండేది. కానీ ఇప్పుడు ఇండోనేషియా నుంచి వస్తున్న కొబ్బరి పుల్లలకు ఇతర రాష్ట్రాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక్కడ కూలి ఖర్చులు అధికంగా ఉండటమే కాకుండా, పుల్లల్లో నాణ్యత లోపించడం మార్కెట్ నష్టాలకు కారణమతోంది. 40 ఏళ్లగా వ్యాపారం చేస్తున్నాం. ఇప్పుడు మాత్రం నిర్వహణ చాలా కష్టంగా ఉంది.

-సంజయ్ కుమార్ శర్మ (టిల్లు), కొబ్బరి వ్యాపారి, కంచిలి

ఉపాధి పథకం వర్తింపజేయాలి..

కొబ్బరి పంట అభివృద్ధికి సాయం చేస్తున్న ప్రభుత్వం కొబ్బరి అనుబంధ వస్తువుల సేకరణకు కూడా పథకం వర్తింప చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా కొబ్బరి కొమ్మలు సేకరించడం, పుల్లలు సిద్ధం చేసే పనులకు ఉపాధి పథకం వర్తింపచేయాలి.

-రాకేష్ అత్‌ఘర్, కొబ్బరి వ్యాపారి, కంచిలి

ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు చర్యలు

పాతపట్నం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. మెళియాపుట్టి మండలం వసుంధర చెక్‌పోస్టును పరిశీలించి పలు వాహనాలను తనిఖీ చేపట్టారు. సారా తయారీ, విక్రయం, తరలింపు చేపట్టినా కఠినచర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆయన వెంట సీఐ కోట కృష్ణారావు తదితరులున్నారు.

తనీషకు మంత్రి లోకేష్ అభినందన


తనీషకు ల్యాప్‌టాప్ ఇచ్చి అభినందిస్తున్న మంత్రి నారా లోకేష్

హరిపురం ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ ఇంటర్, ఒకేషనల్ కళాశాలల్లో విద్యనభ్యసించి అత్యధిక మార్కులు సాధించిన 52 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్-2025తో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం అభినందించారు. ఈ అవార్డును నిమ్మకూరు ఏపీఆర్‌జేసీలో చదువుతున్న మందస మండలం దున్నూరు పంచాయతీ పితాళి గ్రామానికి చెందిన పుచ్చ తనీష చోటు దక్కించుకుంది. రోజు కూలీలైన పుచ్చ పాపారావు, శారద కుమార్తె తనీష ఇంటర్ బైపీసీలో 940 మార్కులు సాధించి మంత్రి లోకేష్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంది. గోల్డ్ మెడల్‌తో పాటు ల్యాప్‌టాప్‌ను మంత్రి అందించి అభినందించారు.

ఓటరు నమోదుపై నిర్లక్ష్యం వద్దు


మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్‌వీఎన్ శ్రీధరరాజా

పాతపట్నం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదులో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, జడ్పీ సీఈవో ఎల్‌వీఎన్ శ్రీధరరాజా అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించాలి

నియోజకవర్గ అభివృద్ధిపై కార్యాచరణ ప్రణాళికలకు రూపొందించాలని జడ్పీ సీఈవో ఎల్‌వీఎన్ శ్రీధరరాజా అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047లో చేపట్టాల్సిన అంశాలను నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలో పొందుపరచాలన్నారు.

పౌష్టికాహారం పంపిణీలో తేడాలొస్తే చర్యలు

హరిపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీలో తేడాలొస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ స్పష్టంచేశారు. సవరరాజపురం, డలసరి, బొందికారి అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె బుధవారం సందర్శించారు. బొందికారిలో తల్లులు, బాలింతలు, గర్భిణులతో సమావేశం నిర్వహించారు. డలసరిలో చిన్నారులతో మాట్లాడారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేసవిలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, సూపర్‌వైజర్ల సందర్శనలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం: జడ్పీటీసీ


హరీష్‌కు నగదును అందజేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు

హిరమండలం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రతిభ, నైపుణ్యానికి పేదరికం అవరోధం కాకూడదని జడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు అన్నారు. గొట్ట గ్రామానికి చెందిన బత్తుల హరీష్ క్రికెట్‌లో రాణిస్తున్నప్పటికీ సరైన శిక్షణకు ఆర్థిక సమస్య అవరోధంగా నిలిచింది. ఈ నేప థ్యంలో జడ్పీటీసీ ముందుకు వచ్చి విశాఖపట్నంలో ఓల్డ్ నేవీ క్రికెట్ అకాడమీ నిర్వాహ కుడు ఎం.రాజుతో మాట్లాడి అక్కడ ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేశారు. క్రికెట్ సామగ్రి కొనుగోలు నిమిత్తం బుచ్చిబాబు తన స్నేహితుడు బర్రి శేఖర్‌ను సంప్రదించి రూ.20 వేలు నగదును బుధవారం అందించారు. హరీష్‌ను మరింత ప్రోత్సహించేందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు జడ్పీటీసీ తెలిపారు.

న్యూస్ బాక్స్

ఒక పండు.. మూడు పిక్కలు



వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఒక జీడి పండుకు మూడు పిక్క లు రావడంతో అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒక పిక్క ఉండడం సాధా రణం.. అప్పుడప్పుడు రెండు పిక్కలు వస్తాయి. అయితే ఏకంగా మూడు పిక్కలున్న జీడి పండు అక్కుపల్లి రైతు తోటలో కనిపించింది. ఇలాంటివి అసాధారణంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు.

యంత్ర పరికరాలు వినియోగించుకోండి

నందిగాం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కస్టమ్ హైరింగ్ కేంద్రంలో ఉన్న వ్యవసాయ పనిముట్లను రైతులు వినియోగించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.కృష్ణారావు సూచించారు. బుధవారం పెద్దతామరాపల్లి, చిన్నతామరాపల్లి రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ పనిముట్లను పరిశీలించారు. ట్రాక్టర్, రోటావేటర్, వరికోత, నూర్పు యంత్రాలు తదితర పరికరాలను అద్దెకు తీసుకువెళ్లవన్నారు. ఏవోపి.శ్రీకాంత్‌వర్మ పాల్గొన్నారు.

నార పంటల సాగు పెంచాలి

జలుమూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సహజ నార పంటల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులు ముందుకు రావాలని జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశోధన శాస్త్రవేత్త జి.చిట్టిబాబు అన్నారు. యలమంచిలిలో బుధవారం సహజ నార పంటలపై రైతులకు అవగాహన కలిగించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గాలంటే సహజ నార పంటలు అందుబాటులోకి రావాలన్నారు. వ్యవసాయాధికారి కె.సురేష్, జ్యూట్ కార్పొరేషన్ మేనేజర్ అరుణ, శాస్త్రవేత్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీకి సహకరించండి

టెక్కలి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి సహకరించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌హెచ్‌ఆర్ తేజచక్రవర్తి మల్ల అన్నారు. బుధవారం స్థానిక కోర్టుల సముదాయంలో న్యాయవాదులు, పోలీస్ అధికారులతో సమావేశాలు నిర్వహించారు. రాజీకి అనుకూలమైన కేసులను పరిష్కరించేలా సహకరించాలని కోరారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, న్యాయ వాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నేడు మంత్రి అచ్చెన్న పర్యటన

టెక్కలి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): లింగాలవలస గ్రామంలో గురువారం సాయంత్రం 5 గంటలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి తెలిపారు. పీహెచ్‌సీని ప్రారంభించనున్నారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

డీటీకి తహసీల్దార్‌గా పదోన్నతి

హిరమండలం,ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): హిరమండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న కె.బాలకృష్ణ తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. ఈయనను కొత్తూరు తహసీ ల్దార్‌గా నియమిస్తూ కలెకర్ నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి.

ప్రభుత్వ బడులను కాపాడుదాం

నరసన్నపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను కాపాడేందుకు కార్యచరణ ప్రణాళికతో యూటీఎఫ్ ముందుకు సాగుతుందని సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్. కిశోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సంఘ ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కోరాడ వైకుంఠరావు, దమయంతి, టి.సుధీర్, బాడాన రాజు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో తనిఖీ

నరసన్నపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) స్థానికంగా ఉన్న పెట్రోల్ బంకును శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష బుధవారం తనిఖీ చేపట్టారు. పెట్రోలు, డీజిల్ సాంద్రత, క్వాలిటీ తదితర విషయాలను పరిశీలించారు. బంకులో మౌలిక సదుపా యాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉచిత గాలి, మరుగుదొడ్లలో నీరు లేకపోవడం తదితర అంశాలను గుర్తించారు. కొలతలో తేడా, జంపింగ్ తదితర అంశాలను పరిశీలించారు. కార్యాక్రమంలో సీఎస్‌డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

బస్సు-బైక్ ఢీ: ఒకరి మృతి

పర్లాకిమిడి,ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మోహన సమితి చిత్తబొర గ్రామంలో బస్సు బైక్ ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మృతి చెందిన వ్యక్తి తన చెల్లిని అత్తవారి ఇంట విడిచిపెట్టి తిరిగి వస్తుండగా చితబొర గ్రామం వద్ద వస్తున్న బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు చేరుకొని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేయడం తో ఎస్ఐ బసంత్‌కుమార్ శెట్టి ఘటనా స్థలానికి చేరుకొని శాంతింపజేశారు. మృతుడుది సియోలొటి పంచాయతీ మొంటియబో గ్రామం. డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.